

హజరత్ జమాలుల్లా బాషా ఈద్గాలో బక్రీద్ ప్రార్థనలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నమయ్య జిల్లా రాయచోటిలో హజరత్ జమలుల్లా బాషా ఈద్గాలో ఈద్ ఉల్ అజహ నమాజ్ ప్రార్థనలు నిర్వహించేందుకు ఈద్గా ప్రెసిడెంట్ బేపారి బషీర్ ఖాన్ ఆధ్వర్యంలో సిద్ధం చేశారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను వారి సోదరులతో కలిసి ఈద్గాహ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బేపారి మహమ్మద్‌ఖాన్ పరిశీలించారు. ప్రార్థనలలో పాల్గొనే ముస్లిం సోదరులు ఉదయం 7.30 గంటలకు ఈద్గాకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 8 గంటలకి మత గురువు సర్కాజి సర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరుగుతాయన్నారు. త్యాగానికి, మత సామరస్యానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ముస్లిం సోదరులకు ముందస్తు బక్రీద్ శుభాకంక్షలు తెలియజేశారు.

ఇఎంటి పోస్టుల భర్తీలో ఉల్లంఘనలు



- రాష్ట్రమంతా ఒకదారైతే కడపలో మరోదారి
- అనర్హులుగా మెడికల్ ఇన్ సర్వీస్ పీజీలు
- 18న ముగ్గురికి అపాయింట్‌మెంట్లు?!
- నిద్రావస్థలో జిజిహెచ్ సూపరింటెండెంట్

ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల భర్తీలో గైడ్‌లెన్స్ ఉల్లంఘనల పరంపర కొనసాగుతోంది. 2022 ఆగష్టు, 2022 నవంబర్, 20 23 ఫిబవరి మాసాల్లో ఇఎంటి పోస్టుల భర్తీ ప్రక్రియ నడిచింది. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలైన విజయనగరం, గుంటూరు, పశ్చిమగోదావరి తదితర జిల్లాల్లో పీజీలను రిక్రూట్‌మెంట్లకు అనుమతించినట్లు తెలుస్తోంది. కానీ కడప జిల్లాలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులో డిప్లమా పూర్తి చేసిన పీజీలను కాదని, డిగ్రీ కోర్సు తరహా ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీ షియన్ చదివిన వారి అర్హులుగా నిర్ణయించడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇందులోభాగంగా ఈనెల 18న డిగ్రీ కోర్సు పూర్తి చేసిన ముగ్గురికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వనున్నట్లు సమాచారం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో పలువురు పీజీలు పలుమార్లు కడప జిజిహెచ్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో విస్మయాన్ని కలిగిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఊపందుకుంది. ఈమేరకు గత ఫిబ్రవరిలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల యంత్రాంగం 48 ఇఎంటి పోస్టుల భర్తీకి నోటి ఫికేషన్ విడుదల చేసింది. ఈమేరకు 48 మంది టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 12 మంది పీజీ డిప్లమా, 12 మంది బిఎస్‌సి, మరో 18 మంది ఇతర కోర్సులు చేసిన అభ్యర్థుల దరఖాస్తులు ఉన్నట్లు సమాచారం. వీరిలో 12 పీజీ దరఖాస్తులను తిరస్కరించి భర్తీ చేపట్టడం పీజీల్లో ఆందోళన నెలకొంది. 2013 సంవత్సరంలో 108 సేవల విభాగంలో సీనియర్లుగా గుర్తింపు పొంది, ఎంట్రన్స్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులకు రాష్ట్రప్రభుత్వం ఎంపిక చేసింది. బిఎస్‌సి కంటే ఉన్నత విద్య పీజీ కోర్సును అభ్యసించిన వారిని విస్మరించి డిగ్రీ (బిఎస్‌సి ఇఎంటి) చేసిన వారిని అర్హులుగా నిర్ణయించమే మిటనే ప్రశ్న వినిపిస్తోంది. 2022 నవంబర్‌లో విజయ నగరం, తాజాగా కడప జిల్లాలో మినహా మిగిలిన జిల్లాలో కొత్తగైడ్ లైన్స్ ప్రకారం పీజీలను పోస్టింగ్స్‌కు అర్హులుగా చేసి పోస్టుల భర్తీ నడిపిన జిల్లాలను ఉద హరిస్తుండడం గమనార్హం. కానీ జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ గైడ్ లెన్స్ అప్‌డేట్ గాకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడంపై విమర్శల వర్షం కురుస్తోంది. 2022 ఆగష్టులో రాష్ట్రంలోని 10 పాత వైద్య కళా శాలలకు మూడు పోస్టుల చొప్పున 64 టెక్నీషియన్ పోస్టులను భర్తీ ప్రక్రియ నడిచింది. ఇందులో ఇప్పటి వరకు 61 పోస్టులను భర్తీ చేసినట్లు సమాచారం. మిగిలిన మూడు పోస్టులు జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందినవి కావడం గమనార్హం. వీటిని భర్తీ చేయాలనే అప్పటి జాయింట్ కలెక్టర్ సూచనను జిజిహెచ్ సూపరింటెండెంట్ బేఖాతర్ చేశారనే విమర్శలు ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి కీ.శే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి యూనివర్శిటీగా నామకరణం చేసిన మెడికల్ కళాశాలల్లో ఆయన ఉన్నత విద్యకు సిఫారసు చేసిన పీజీ అభ్యర్థులను తిరస్కరించడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌లో పీజీ డిప్లమా, బిఎస్‌సి ఇఎంటిలకు సమాన అవకాశాలు కల్పించిన అనంతరం మెరిట్ ఆధారంగా రిక్రూట్‌మెంట్ నిర్వహించాలనే వాదన వినిపిస్తోంది. దీనిపై పీజీలు పలుమార్లు సూపరింటెండెంట్‌ను కలిసి రాష్ట్రంలోని ఇతర జిల్లాల రిక్రూట్‌మెంట్ ప్రక్రియల కాపీలను చూపించినప్పటికీ అప్‌డేట్ గాకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇదేతరహా ధోరణిలోనే ఈనెల 18న మెడికల్ ఎమర్జెన్సీ మెడికల్ కోర్సు పూర్తి చేసిన పీజీలను కాదని, బిఎస్‌సి డిగ్రీ కోర్సు ఆధారిత మెడికల్ ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్ పూర్తి చేసిన ముగ్గురికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వనుండడంపై ఆందోళన నెలకొంది.

మరోసారి నోటిఫికేషన్ పరిశీలన

నోటిఫికేషన్ ఆధారంగా ఇఎంటి పోస్టింగ్స్ భర్తీ చేస్తాం. గత ఫిబ్ర వరిలో విడుదల చేసిన పాత నోటిఫికేషన్ ఆధారంగా భర్తీ ప్రక్రియ కొలిక్కి వచ్చిన మాట వాస్తవమే. తాజాగా మరోసారి నోటిఫికేషన్ పరిశీలన చేసిన అనంతరం పోస్టింగులను భర్తీ చేస్తాం.

-కె.రమాదేవి, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి, కడప.



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

కార్యకర్తలు అధైర్య పడవద్దు : ఎంపీ

ప్రజాశక్తి -రైల్వేకోడూరు

వైసిపి ఓటమిపై నాయకులు, కార్యకర్తలు అధైర్య పడకుండా మనోధైర్యంతో ఉండాలని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొ న్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసిపి కార్యకర్తలు ప్రజలు తనను మీ బిడ్డగా భావించి రాజంపేట ఎంపీగా గెలిపించినందుకు వైసిపి కుటుంబ సభ్యుల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. రాష్ట్రంలో వైసిపి ఓటమి చెందడం బాధాకరమని,కార్యకర్తలు నాయకులకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం మొదటిసారి పార్టీ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఎంపీ మిథున్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాజంపేట, కోడూరులోని వైసిపి నాయ కులు, కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, చిట్వేలి కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, చొప్పా రమణారెడ్డి, వైసిపి నాయ కులు సుకుమార్‌రెడ్డి, పుల్లంపేట ఎంపిపి బాబుల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరా మరాజు, ఎం.వెంక టరమణ, సర్పంచ్‌లు డి.చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యంరాజు, శివయ్య, గోపినాథ్, ఉప సర్పంచ్ వై.చంద్రశేఖర్, జైపాల్‌రెడ్డి, సుధాకర్‌రాజు, రమేష్, నాగేంద్ర, రాజేశ్వరి, అరుణ పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్ : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి

త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి వర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం స్ఫూర్తితో ప్రజలు సత్యం, న్యాయం,ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, బాధ్యతాభావం అలవరచుకోవాలని ఆయన కోరారు. ప్రజలందరూ ఆరోగ్యాలు, సుఖ శాంతులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లాలో ఎల్లప్పుడూ మత సామరస్యం వెల్లివిరియాలన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రాంప్రసాద్ రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తోందని వైఎస్ఆర్‌సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

నేడు ఆకాశవాణిలో ప్రత్యేక కార్యక్రమం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈనెల 17న ఆకాశవాణి కడప కేంద్రం 62వ వసంతంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో రేడియోలో ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు కడప కేంద్రం ప్రోగ్రామ్‌హెడ్ చుండూరి మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు అనుభవాలు– అపూర్వ కార్యక్రమాల పేరుతో ఎస్. రవికుమార్‌రెడ్డి రచించిన కార్యక్రమం ప్రసారం కానుందని పేర్కొన్నారు. ఇందులో వివిధ రంగాల ప్రముఖులతో పరిచయాలు, శ్రోతల మదిని దోచిన పలు అంశాలు ఉంటాయని తెలిపారు. మీడియం వేవ్, ఎఫ్‌ఎం ద్వారానే కాకుండా శ్రోతలు న్యూస్ ఆన్ ఎయిర్ యాప్ ద్వారా కార్యక్రమాలను వినవచ్చని పేర్కొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

భారతదేశానికి రాష్ట్రపతి ప్రథమ పౌరుడు. అయితే ఉపాధ్యాయుడే ఆయకంటే మిన్న అని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం ఉపా ధ్యాయుడు ఒ.వి రమణ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమణ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజానికి తల్లిదండ్రులు, దైవం కన్నా గురువే ముఖ్యమన్నారు. పిల్లలను తీర్చిదిద్దడంలోనూ, సమసమాజ నిర్మాతలుగా మలచడంలో ఉపా ధ్యాయులపాత్ర కీలకమని తెలిపారు. రమణ 42 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతోమంది పిల్లలను ఉన్నతులుగా తీర్చి దిద్దారని కొనియాడారు. ఉద్యోగస్ఫూర్తిని పలువురు ఆదర్శంగా తీసుకొని ఆయన బాటలో పయనించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు, బాస్ నాయకులు పిటిఎం శివప్రసాద్, ఎంఆర్‌పిఎస్ నాయకులు నరేంద్ర, వాసు మాజీ ఎంఇఒ, కవి పోతుబోలు రెడ్డప్ప, మాజీ జైలర్ లక్ష్మీనారాయణ, మదనపల్లె డివిజన్‌లోని విద్యార్థులు, అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పలువురు నాయకులు



మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డికి బొకే అందజేస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర రవాణా, సమాచార, యువజన సర్వీసుల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డిని రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి, టిటిడి మాజీ పాలకమండలి సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు కలిశారు. రాంప్రసాద్ రెడ్డి మంత్రిగా పదవి బాధ్యతలు తీసుకొని మొట్ట మొదటిసారిగా రాయచోటికి విచ్చేసిన సందర్భంగా ప్రసాద్‌బాబు సంజీవనగర్ కాలనీలో ఆయన ఇంటికి వెళ్లి పూల బొకే ఇచ్చి దృశ్శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు ఏకాంతంగా పలు విషయాలపై చర్చించారు. గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై చోటు చేసుకున్న పరిణామాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. కార్యకర్తలకు అండగా నిలిచేందుకు సూచనలు చేసుకున్నారు. అదేవిధంగా అన్నమయ్య జిల్లా అభివృద్ధిపై పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, అందుకు తగు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకున్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. **రాజంపేట అర్బన్ :** రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఆదివారం రాజంపేట టిడిపి నాయకులు శాలువా, పుష్పగుచ్చంతో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి అండగా ఉంటానని ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చినట్లు టిడిపి నాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు తరిగోపుల లక్ష్మీ నారాయణ, మాజీ మండల అధ్యక్షులు బసినేని వెంకటేశ్వర్లు నాయుడు, గీతాంజలి రమణ, డాక్టర్ నవీన్ కుమార్, విశ్రాంత పీ.డీ షామీర్‌బాష పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** రాష్ట్ర రవాణా,యువత, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి యువ నాయకులు ముక్కా సాయివి కాస్‌రెడ్డిలు మర్యా ద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తనకు కేటాయించిన శాఖల నుంచి రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అంది స్తానని తెలిపారు. ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఒక ప్రణాళిక సిద్ధం చేసుకుని త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.



మంత్రి మండిపల్లితో ఎమ్మెల్యే శ్రీధర్, యువనాయకులు సాయి వికాస్‌రెడ్డి

ఎక్కడి చెత్త అక్కడే

- కంపు కొడుతున్న మున్సిపాల్టీ
- మూలనపడిన చెత్త సేకరణ వాహనాలు
- చెత్త తొలగించాలని ప్రజల వేడుకోలు



బాలాజీ నగర్‌లో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట మున్సిపాలిటీలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి కంపు కొడుతోంది. ఇటీవలే కొనుగోలు చేసిన 15 చెత్త సేకరణ వాహనాలలో సుమారు 8 వాహనాలు రిపేరుకు వచ్చి మూలన పడ్డట్లు సమాచారం. కొన్ని నెలల్లోనే వాహనాలు రిపేరుకు రావడంపై సర్వత్రా అనుమానాలకు తావిస్తోంది. సుమారు రెండు నెలలు 8 చెత్త సేకరణ ఆటోలతో పాటు రెండు మినీ ట్రాక్టర్లు మరమ్మ తులకు నోచుకోక మూలన పడ్డారు. దీంతో రాజంపేట పట్టణంలో ఎక్కడి కక్కడ చెత్త పేరుకుపోయి పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ము ఖ్యంగా బాలాజీ నగర్‌లోని చెత్త పాయింట్ వద్ద చెత్తంతా సగం రోడ్డును ఆక్ర మిం చడంతో వాహన చోదకులు, పాద చారు లు రాకపోకలను ముక్కుమూసుకొని దుర్గంధాన్ని భరిస్తూ వెళుతున్నారు. చెత్త సగం రోడ్డుకు ఉండటంతో ఆ దారిన కేవ లం ఒక వాహనం మాత్రమే వెళ్లేం దుకు వీలుంటోంది. చాలా రోజులుగా చెత్త తొల గించకపోవడంతోనే ఇలా పేరు కుపో యిందని స్థానికులు చెబు తున్నారు. పక్కనే మురుగు కాలువ కూడా ఉండ డంతో చెత్త, మురుగునీటితో కలిసిపోయి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చెత్తను తొల గించాలని ప్రజలు కోరురుతున్నారు. చెత్త సేకరణ వాహనాలకు మరమ్మతులు చేపట్టి పట్టణవ్యాప్తంగా పారిశుధ్యంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని పట్టణ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

హామీల అమలు చంద్రబాబుకే సాధ్యం

ప్రజాశక్తి-పీలేరు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. పీలేరు నియోజకవర్గ విభిన్న ప్రతిభావంతుల సంఘ సభ్యులు ఆదివారం కలికిరిలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సన్మానించి సత్కరించారు. గత వైసిపి ప్రభుత్వ పాలకుల అక్రమాలను బయట పెడుతూ రాష్ట్రంలో ఎదురులేని నాయకుడిగా, నియోజకవర్గంలో తన ప్రత్యర్థిపై 25 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యేను వారు కలసి అభినందించారు. కొలువు దీరిన కొత్త ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టు కున్నారని, నిస్సహాయులైన విభిన్న ప్రతిభావంతులను గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా వారికి ప్రస్తుతం ఇస్తున్న రూ.3 వేలు పెన్షన్ ను ఒకే సారి రూ.6 వేలకు పెంచిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పివి చలపతి, ప్రధాన కార్యదర్శి వెంకట రమణ, కార్యదర్శి పీలం లక్ష్మీ నారాయణ, సభ్యులు వెంకట రెడ్డి, నాగలక్ష్మి, భారతి, నాయుడు, గౌస్ బాష, మణి, ఖాదర్ బాష, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

ఎస్‌పిఒలను ప్రభుత్వం ఆదుకోవాలి



విలేకర్ల సమావేశంలో అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ ఆఫీసర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘ సివిల్ అసోసియేషన్ సెక్రటరీ ధర్మచంద్ కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2020 జనవరిలో స్పెషల్ పోలీస్ ఆఫీసర్ రిక్రూట్మెంట్ కింద రాష్ట్ర వ్యాప్తంగా 2,156 మంది విధుల్లో చేరారని తెలిపారు. తాము పోలీసు, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ కింద విధులు నిర్వహించి చెక్ పోస్టుల్లో నాటుసారా, అక్రమమధ్యం, గంజాయి, ఇసుక, ఎర్రచందనం తదితర అక్రమ రవాణాను అడ్డుకోవడంలో తాము ఎంతో బాధ్యతగా చేసినట్లు తెలిపారు. కరోనా సమయంలోనూ ప్రాణాలకు తెగించి విధులు పాల్గొన్నామని పేర్కొన్నారు. 2022 మార్చి తరువాత తమల్ని ఇలాంటి నోటీసు ఇవ్వకుండా పక్కన పెట్టడంతో అప్పటినుంచి కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. కొత్త ప్రభుత్వం తమను ఆదుకొని ఉద్యోగాలు తిరిగి భర్తీ చేసి విధుల్లో చేరేలా జీవో జారీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నరసింహ, విజయ్, రమణ లక్ష్మీపతి, రామాంజనేయులు, రమణప్ప, ఆనంద్, దొరబాబు, రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో రాజకీయ జోక్యాన్ని నివారించాలి

యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి కడప అర్బన్

విద్యుత్ సంస్థలలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని, అవినీతిని అరికట్టాలని యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుదర్శన్‌రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కడప జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బి. నాగసుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా యుఇఇయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఉద్యోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, యూ నియన్ హక్కులు కోల్పోయారని, పూర్తిగా రాజకీయ జోక్యంతో బదిలీలు ఇతర కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యుత్ సంస్థలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని కోరారు. కామనురు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ సాను భూతిపరులని కొంతమంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, ఇప్పుడు కూడా ప్రస్తుతం అదే పద్ధతిని కొనసాగించేందుకు ప్రయత్నం చేయడం సరికాదని పేర్కొన్నారు. చిన్న ఉద్యోగుల పట్ల కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పనిచేయాలని మనవి చేశారు. డిస్కాం ప్రెసిడెంట్ ఎన్.శివ శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యుత్ సంస్థలోనూ పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, వాటన్నిటి పైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అ గతంలో ఉన్న సర్వీస్ రెగ్యులేషన్స్ ప్రకారం కారుణ్య నియామకాలు, వారికి సంబంధించిన వేతనాలు చెల్లించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు మేలు చేసేలా ఒకే వేతన విధానం అమలు చేయాలని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహరి మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ఉద్యోగులు, ఎనర్జీ అసిస్టెంట్లు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారి సమస్యల పరిష్కారానికి ఎన్ని వినతి సమర్పించిన యాజమాన్యం సరైన రీతిలో స్పందించలేదని చెప్పారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో ఈ సమస్యలు అన్నిటి పైన విద్యుత్ యాజ మాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నాయిబ్ రసూల్, జిల్లా ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సురేం ద్రబాబు, జిల్లా కార్యదర్శి వెంకటరమణ, పుల్లయ్య, రాజంపేట డివిజన్ నాయకులు ఎరీకల రెడ్డి, సుబ్బారెడ్డి, పొద్దుటూరు డివిజన్ నాయకులు మహబూబ్ షరీఫ్, మైదుకూరు డివిజన్ నాయకులు నాగ మల్లయ్య, రామ్మోహన్, కడప డివిజన్ నాయకులు శివ ప్రసాద్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, రాయచోటి డివిజన్ నాయకులు రెడ్డప్ప, అమర్నాథ్‌రెడ్డి, నాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుఇఇయు, సిఐటియు నాయకులు



మారమ్మ సన్నిధిలో ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

ఘనంగా మారమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ మారమ్మతల్లి ఆలయంలో పొంగళ్ల మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లను అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి మేడా విజయభాస్కర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ధర్మకర్తలు శింగమాల సుబ్బరామిరెడ్డి, దుర్గాప్రసాద్ రెడ్డి ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువా పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, వైసిపి నాయకులు తుమ్మల శ్రీధర్ గౌడ్, అక్కిరెడ్డి మోహన్ రెడ్డి, సోమిశెట్టి ప్రభాకర్, అరిగే నాని, ఓట్స్ శ్రీనివాసులు, పెనుబాల నాగసుబ్బయ్య కాకిచంద్ర, గుండు గోపాల్ రెడ్డి, ఆకేపాటి రమేష్ రెడ్డి, స్వామి ఏలుమలై, వాణి పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లో చేరాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బాలికా ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా బడి ఈడు కలిగిన పిల్లలందరూ బడిలోనే ఉండాలని మండల విద్యాశాఖ అధికారి రెడ్డిశేఖర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ చదువుకున్న వ్యక్తులే దేశానికి శక్తి అని, ముఖ్యంగా బాలికలు చదువులో రాణించాలని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్షల్లో జిల్లా మొదటి స్థానం, రాష్ట్రస్థాయిలో 5వ స్థానం నిలిచిందని అదే స్ఫూర్తితో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్నిసౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు భాస్కర్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుని శైలజ పాల్గొన్నారు.

జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటిఎం మండలంలోని మడుమూరు పంచాయతీ ఆముల్దార్లపల్లెలో ఆదివారం జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జనసేన నియోజక వర్గ భాద్యుడు పోతులసాయినాథ్ మండల అధ్యక్షుడు శంకర ముఖ్య అతిధులుగా విచ్చేసి జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిగ్రామంలో ఉన్న జనసేన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఎన్‌డిఎ కూటమిలో ఉన్న ప్రతి కార్యకర్త గ్రామాల అభివృద్ధిలో పాలు పంచుకునేలా చేస్తామని అన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా గ్రామీణాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అందిస్తారని చెప్పారు. వైసిపి అరాచక పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఇక రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో సువర్ణ పాలన అందుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

మా కొడుకుని ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-రామసముద్రం

కంటి చూపు కోల్పోయిన తమ కొడుకు భరత్ కంటి చూపు తెప్పించుకునేందుకు ఆర్థికంగా ఆదుకోవాలనిమండల కేంద్రంలోని గాజుల నగరానికి చెందిన మంజునాథ్, హశ్వనిలు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కోరారు. ఆదివారం మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాలుడి తల్లి మాట్లాడుతూ తాము ఆర్థికంగా పేద కుటుంబానికి చెందిన వారమని, మెరుగైన వైద్యం అందిస్తే తమ కొడుకుకు కంటి చూపు వస్తుందని అన్నారు. ప్రభుత్వం నుంచి తమకు సాయం అందించమని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు.

నేడు ద్రౌపది మాత కల్యాణోత్సవం

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రమైన రామాపురంలో నిర్వహిస్తున్న మహాభారతి యజ్ఞంలో భాగంగా సోమవారం ద్రౌపది మాత కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు మహాభారత కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్రౌపదీమాత తరపున కొందరు దాతలు పాండవుల తరపున కొందరు దాతలు పాల్గొని కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలం లోని ప్రజలు పెద్ద ఎత్తున ద్రౌపతి మాత కళ్యాణోత్సవానికి ఉత్సవాన్ని తిలకించాలని కోరారు. ప్రతిరోజూలాగే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అంగన్వాడీలకు జీతాలు పెంచాలి

పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంతోపాటు వారికి జీతాలను నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు పెంచాలని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి కోరారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ అంగన్వాడీ వ్యవస్థ మహెూన్నతమైందన్నారు. కాంగ్రెసు పార్టీ మానస పుత్రిక అన్నారు. బాలబాలికల్లో, గర్భిణుల్లో, బాలింతల్లో పౌష్టికాహారం లోప నివారణ కోసం 1975లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ అంగన్వాడీ వ్యవస్థను ఏర్పాటు చేసిందని తెలిపారు. అంగన్వాడీ వర్కర్లు, సహాయకులు తల్లిగా, ఉపాధ్యాయులుగా, నర్సుగా, డాక్టర్‌గా బహుముఖ సేవలు చేస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీలకు ఇస్తున్న జీతాలు చాలా తక్కువ అన్నారు. అంగన్వాడీ వర్కర్లుకు నెలకు రూ.11,500 సహాయకులకు రూ.7వేలు గౌరవ వేతనం ఇవ్వడం బాధకరమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడ వీరు అనర్హులుగా చేయడం దారుణమన్నారు. అంగన్వాడీలు పదవీ విరమణ చేసిన తర్వాత వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంటుందని తెలిపారు. అంగన్వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు చేపట్టగా గత వైసిపి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదని తెలిపారు. నూతన టిడిపి ప్రభుత్వమైనా అంగన్వాడీల సమస్యలపై దృష్టి పెట్టి జీతాలు పెంచాలని సిఎం చంద్రబాబును తులసిరెడ్డి కోరారు.

నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలను సోమవారం సాయంత్రం 5.40 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్, శిల్పారామంలో నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో శ్రీకిషోర్ అకాడమీ కడప కళాబృందం, శిల్పారామంలో సూర్య అకాడమీ మదనపల్లి కళాబృందంచే క్లాసికల్, జానపద, వెస్టర్న్ మొదలగు నృత్య ప్రదర్శనలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. పులివెందుల పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సదరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్రంలో ప్రజా రంజకపాలన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఇక రాష్ట్రంలో ప్రజారంజక పాలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐదు సంతకాలతో శ్రీకారం చుట్టారని జమ్మలమడుగు పట్టణానికి చెందిన టిడిపి యువనేత జింకల మహబూబ్ బాషా తెలిపారు. ఆదివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 175 స్థానాలకు 164 స్థానాల్లో కూటమి విజయకేతనం ఎగరవేసిందన్నారు. ముఖ్య మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే చంద్రబాబు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పింఛన్లు, అన్నా క్యాంటీన్లు, స్కిల్ డెవలప్మెంట్ వంటి ఐదు అంశాలపై సంతకం చేశారన్నారు. ఇది నిరుద్యోగ యువతలో, పింఛన్ తీసుకునే వారిలో, రైతుల్లో, అన్నార్తుల్లో సంతోషాన్ని నింపిందన్నారు. మారిన బాబును చూస్తారని చెప్పినట్లుగానే మంత్రులకు శాఖలు కేటాయించడంతో ముఖ్యమంత్రి తనదైన శైలి చూపించారన్నారు. రాష్ట్ర భవిష్యత్ యువ ప్రజా ప్రతినిధుల చేతుల్లో కీలక మంత్రిత్వ శాఖలు బాబు పెట్టారన్నారు. నియోజకవర్గంలో టిడిపి ఇంఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామి రెడ్డి ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో కలసి ప్రజాసంక్షేమంతోపాటు అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తారన్నారు. టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తలకు మంచిరోజులు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, భూపేష్ రెడ్డి ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించే పనిలో ఉన్నారన్నారు. సంస్థలన్నీ ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్నారన్నారు.

ఎమ్మెల్యేను గెలిపించి మాట నిలబెట్టుకున్నా : 'ముక్కా'



మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌కు ఇచ్చిన మాట ప్రకారం అందరి సహకారంతో కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించి మాట నిలబెట్టుకున్నానని రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ముందుగా ప్రకటించిన అభ్యర్థిని మార్చి తాను ప్రతిపాదించిన శ్రీధర్‌కు టికెట్ ఇచ్చిన పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుతున్నానని అన్నారు. నియోజకవర్గంలో అధికారులందరూ తనను కలిశారని ప్రజలకు ఉపయోగకరమైన కార్యక్రమాలను అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వారికి తెలిపానని అన్నారు. పట్టణంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిం చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు మొదటి సంతకం మెగా డిఎస్‌సి, రెండవ సంతకం రూ.4వేలు పింఛన్, మూడో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, నాలుగవ సంతకం స్కిల్ సెన్సెస్, ఐదవ సంతకం అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ ఐదు ఫైళ్లపై సంతకాలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని అన్నారు.

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రామసముద్రం

రామసముద్రం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక టిటిడి కల్యాణ మండపంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సంద ర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, నిస్సహాయులైన విభిన్న ప్రతిభావంతులను గుర్తించి రాష్ట్ర వ్యాప్తంగా వారికి ప్రస్తుతం ఇస్తున్న రూ.3 వేలు పింఛన్‌ను ఒకే సారి రూ.6 వేలకు పెంచిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలనకు స్వస్తి పలికి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించే సమర్థుడైన చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవడంలో ప్రజల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. వారానికి ఒకసారి మండల పర్యటన ఉంటుందని పర్యటనలో తన దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అమలు జరిగేటట్లు చూస్తానని తెలిపారు. కార్యక్రమం అనంతరం నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ గౌడ్ ,సీనియర్ నాయకులు చోక్కాండ్లపల్లి పెద్దిరెడ్డి, సీతారామస్వామి, కృష్ణంరాజు, నారాయణరెడ్డి, మాజీ జడ్‌పిటిసిలు ముని వెంకటస్వామి, శివశంకర్, శ్రీనివాస్‌గౌడ్, రాజేష్‌స్వామి, చిన్నాస్వామి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం : 'బత్యాల'



చెంగల్రాయుడు, ఎమ్మెల్యే శ్రీధర్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-పుల్లంపేట

టిడిపి కూటమి విజయానికి కృషి చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని వత్తలూరు గ్రామ ప్రజలు వారిని భారీ గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చెంగల్రాయుడు మాట్లాడుతూ టిడిపి విజయం చారిత్రాత్మకమని అన్నారు. కాంగ్రెస్ అధినేత్రి ఇందిరాగాంధీ అహంకారానికి ఆంధ్రుల ఆత్మగౌరవం అనే నినాదంతో స్వర్గీయ నందమూరి తారక రామారావు టిడిపి స్థాపించి ఎలాగైతే చారిత్రాత్మక విజయాన్ని అందించారో అదే బాటలో నేడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడారని అన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు సారథ్యంలోని ఎన్‌డిఎ కూటమికి చారిత్రాత్మక విజయం అందించారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అహంకార పూరిత రాజకీయాలు మనుగడ సాగించలేవని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అండగా నిలిచి మద్దతు ప్రకటించి ఉమ్మడి పోరాటంతో వైసిపిని కోలుకోలేని దెబ్బతీశారని అన్నారు. ఎన్‌డిఎ కూటమిలో చంద్రబాబు ప్రధాన పాత్ర పోషించబోతున్నారని తద్వారా కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రానికి మరిన్ని నిధులు, పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య యాదవ్, టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీలో జగనన్న గృహ నిర్మాణ పథకం కింద మంజూరు చేసిన 8000 ఇళ్లపై విచారణ జరపాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసినట్లు టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి పదవిలో ఉన్నప్పుడు ఇల్లు లేని పేదలకు 8000 ఇళ్లను మంజూరు చేశారు. అర్హులైన లబ్ధిదారులు లేకున్నా అందరినీ ఎంపిక చేశారు. ధనవంతులకు, ఇతర ప్రాంతాల వారికి, ఉద్యోగులకు ఇళ్లను మంజూరు చేశారని, ఇందుకు సంబంధించి అనేక ఫిర్యాదులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన స్పందించలేదన్నారు. ఇళ్ల మంజూరు కుంభకోణంలో కీలక పాత్ర వహించిన అప్పటి జాయింట్ కలెక్టర్, అప్పటి పులివెందుల మున్సిపల్ కమిషనర్, బాధ్యులపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, సదరు నకిలీ లబ్ధిదారులపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

ఆర్‌జెడి, డిఇఒపై చర్యలు తీసుకోండి

పులివెందుల టౌన్ : అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఆర్‌జెడి రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో డిఇఒగా, ఆర్‌జెడిగా వైసిపి నాయ కుని కన్నా అధ్వానంగా పనిచేశాడన్నారు. ఇష్టానుసారంగా బదిలీలు చేయడం, ఉపా ధ్యాయులను దూషించడం, మహిళా టీచర్లతో అసభ్యంగా ప్రవర్తించడం, ప్రైవేటు పాఠ శాలలు నిబంధనలు పాటించకున్నా అను మతులు ఇవ్వడం వంటి అనేక అక్ర మాలు చేశాడని ఆరోపించారు. కౌన్సి లింగ్ లేకుండా లంచాలు తీసుకుని బదిలీలు, డిప్యూటేషన్ చేశాడన్నారు. ప్రశ్నిస్తే వారిని విధుల నుండి తొలగించేవారని రాష్ట్రంలో ఏ జిల్లాలో ఇవ్వని విధంగా టీచర్లు నిరసనలు చేయరాదని ఉత్తర్వులు కూడా ఇచ్చాడన్నారు. ఒక అధికారి చేయకూడని పనులన్నీ చేశాడన్నారు. 2023 మార్చిలో జరిగిన ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు మద్దతుగా పనిచేశాడని తెలిపారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఇలాంటివారు విద్యాశాఖలో ఉండడానికి అర్హులు కారన్నారు. వెంటనే వీరిద్దరిని సస్పెండ్ చేసి అక్రమాలపై విచారణ జరిపించి, కఠినంగా శిక్షించాలని కోరుతున్నామని ఎమ్మెల్సీ తెలిపారు.

నూతన ఎడ్యుకేషనల్ పాలసీని వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఎడ్యుకేషనల్ పాలసీని వెనక్కి తీసుకోవాలని ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ విద్యాలయాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి 2024 జూన్ 15 నుంచి జులై 15వ తేదీ వరకు ఎంపిజె ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో విద్య జాగృతి ఉద్య మం నిర్వహించ బోతుందన్నారు. క్షేత్రస్థాయిలో సందర్శించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా ప్రయత్నం చేస్తోందన్నారు. విద్య హక్కు చట్టం–2009ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరిగ్గా అమలు చేయడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు సంబంధించిన సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హుస్సేన్ బాషా, ఉపాధ్యక్షుడు అహ్మద్, కార్యదర్శి మహమ్మద్ అస్లం పాల్గొన్నారు.

వసతి గృహాల్లో దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల అ ర్బన్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో దోమల నివారణకు ఆది వారం మలాథియాన్ పిచికారీ చేశామని సభ్యులు సిద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ సెలవులు పూర్తి చేసుకొని వసతి గృహాలు పునఃప్రారంభించడంతో ముందుస్తు జాగ్రత్తగా జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు మలాథియాన్ పిచికారీ చేశామన్నారు. మలాథియాన్ 6 వారాల నుండి 8 వారాల వరకు దాని పని సామర్థ్యం కలిగి ఉంటుందని సిద్దయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త భాస్కర్, ప్రసాద్, రవీంద్ర పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇకనైనా అహంకారం వీడాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఇకనైనా అహంకారం వీడనాడి మెలగాలని టిడిపి రాష్ట్ర నాయకులు సీఎం సురేష్‌నాయుడు సూచించారు. ఆదివారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాడు టిడిపి జెండా ప్రొద్దుటూరులో భూస్థాపితం చేస్తా, జెండా ఎగరనివ్వను అని అహంకారంగా మాట్లాడారని పేర్కొన్నారు. కూటమి భారీ మెజారిటీతో గెలిచారని, ఉమ్మడి కడప జిల్లాలో 7 సీట్లు కూటమి విజయం సాధించిందన్నారు. గెలిచిన అభ్యర్థులకు, చంద్రబాబు, లోకేష్‌కు హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ.. విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జగన్ అరాచక పాలనతో ప్రజలు విసుగు చెందారని పేర్కొన్నారు. క్రికెట్ బుకీలతో మెలిగిన రాచమల్లు, ఇప్పుడు వారి పరిస్థితి ఏమిటో చూడా లన్నారు. రాచమల్లు తన తల్లి కోరిక మేరకు అన్నదానం కొనసాగిస్తామని చెప్పి, రాజన్న రాచమల్లు క్యాంటీన్ మూశారన్నారు. ప్రభుత్వం ద్వారా నెలకు రూ.15వేలకు లీజు తీసుకొని మూసేశారన్నారు. వారు కొనసాగిస్తే కొనసాగించినట్లు.. లేదంటే తామే స్వాధీనం చేసుకొని అక్కడ అన్న క్యాంటీన్ నెలకొల్పుతామన్నారు. త్వరలో అవినీతి వైసిపి నాయ కులు చిప్ప కూడు తినక తప్పదన్నారు. మీ అక్రమాలకు వత్తాసు పలికిన పోలీసులు, రెవెన్యూ అధికారులను వదలబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వివిఎస్ ముక్తియార్, కామిశెట్టి బాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'వరద'కు డీలర్లు సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రేషన్ షాపు డీలర్లు ఆదివారం ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డిని ఘనంగా సన్మానించారు. రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ 2019కి ముందు ఉన్న విధానాలను పునరుద్ధరించాలన్నారు. గోడౌన్‌ల వద్దే కాటాను తెరవాలన్నారు. మధ్యాహ్నభోజన పథకం, అంగన్వాడీలకు సంబంధించిన బకాయి ఉన్న కమీషన్లను మంజూరు చేయాలని కోరారు. తమ సంఘానికి చెందిన రాష్ట్ర నాయకులు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిశారని, ఆ మేరకు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆయన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కోరారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునర్ధరించాలి

వేంపల్లె : భవన నిర్మాణ కార్మిక సంఘానికి చెందిన సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఆదివారం స్థానిక జిటి కళ్యాణ మండపంలో నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గత వైసిపి ప్రభు త్వం పాలనలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేశార న్నారు. టిడిపి పాలనలో నైనా సంక్షేమ బోర్డుకు నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచపు లిం గన్న, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా బాలాజీ, దస్తగిరి, శ్రీని వాసులు పాల్గొన్నారు.

కమలాపురం ఎమ్మెల్యే అభిమాని రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట: రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రానికి వచ్చే భక్తుల నిత్యాన్నదానం కోసం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి అభిమాని కమలాపురం పట్టణ వాస్తవ్యులు పాలగిరి సుబ్బారెడ్డి ఆదివారం రూ.1,00,116 విరాళం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవల పాటి ముకుందరెడ్డి తెలిపారు. ముందుగా కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వామి పూర్ణకుం భంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ షరీఫ్, జూనియర్ అసిస్టెంట్ రవి చంద్రారెడ్డి పాల్గొన్నారు.



పారిశుధ్యకార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మసీదు కమిటీ సభ్యులు

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పోకనాటి వీధి తౌహీద్ వెల్ఫేర్ సొసైటీ మసీదు సభ్యులు ఆదివారం నగర పంచాయతీ 60 మంది పారిశుధ్య కార్మికులు, 40 మంది పేద ముస్లిం మహిళలకు దుస్తులు పంపిణీ చేసినట్లు మసీదు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి జె.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోను మున్సిపల్ కార్మికుల సేవలు మరువలేవని కొనియాడారు. స్థానిక ఉర్దూ హైస్కూల్ హెచ్.ఎం చెంగల్‌రాయుడు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఒక్కరోజు సెలవు తీసుకున్నా మనం రోగాల బారిన పడటం తప్పదని పేర్కొన్నారు. తౌహీద్ వెల్ఫేర్ సొసైటీ సేవాతత్వాన్ని కొనియాడారు. మసీదు వెల్ఫేర్ సొసైటీ సభ్యులు డాక్టర్ కిరణ్ కుమారును ప్రధానోపాధ్యాయులు చెంగల్రాయులను సన్మానించారు. కార్యక్రమంలో మసీదు ప్రెసిడెంట్ ఖాజాపిర్ కమిటీ సభ్యులు అమీర్, ఖాదర్, మహబూబ్‌బాషా, జవహర్ బాబు, పయాజ్, సుహెల్, సిపిఐ బషీర్, వెంకటరెడ్డి, సమీవుల్లా, సంజీవ్ పాల్గొన్నారు.



ముక్కా రూపానందరెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్

'ముక్కా'కు సన్మానం

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

మండలం పరిధిలో బోటిమీదిపల్లి పంచాయితీ, కాకర్లవారిపల్లి గ్రామంలోని మల్లాలమ్మతల్లి దేవాలయానికి విచ్చేసిన రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డికి సర్పంచ్ వీరపు నేని వెంకటయ్య నాయుడు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నల్లారి'ని కలిసిన మంత్రి 'మండిపల్లి'

ప్రజాశక్తి-కలికిరి

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆదివారం ఆయన రాయచోటి నుంచి నగిరి పల్లి లోని కిషోర్‌కుమార్‌రెడ్డి స్వగృ హనికి విచ్చేసారు. అనం తరం అరగంట సేపు ఏకాం తంగా నియోజకవర్గ రాజకీయ పరిస్థి తులపై చర్చించుకున్నట్లు సమా చారం.



కిషోర్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

క్రైం కార్నర్



రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

ట్యాంకర్, కారు ఢీ : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కడప–చెన్నై జాతీయ రహదారిపై గల ఎస్‌వి కల్యాణ మండపంలో ట్యాంకర్ కారు ఢీకొని ముగ్గురికి గాయాలైనట్లు స్థానిక ఎస్ఐ రఘురాం తెలిపారు. మహారాష్ట్ర లాతూర్‌కి చెందిన విశ్వనాథ్ చంద్రకాంత్, సంతోష్ రఘురాం సూర్యవంశీ, హనుమంతరావు దేశ్ముఖ్, నందిని లాల సాహెబ్ షీలా నలుగురు కారులో తిరుమలకి ప్రయాణిస్తుండగా, తిరుపతి నుంచి కడప వైపు వెళ్తున్న ట్యాంకర్ ఢీకొని కారులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయని తెలిపారు. గాయపడిన క్షతగాత్రులను 108 వాహనంలో హుటాహుటిన రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మరో వ్యక్తికి..

పుల్లంపేట : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండల పరిధిలోని కడప–చెన్నై జాతీయ రహదారిపై పుత్తనవారిపల్లి మలుపు వద్ద ఆదివారం తెల్లవారుజామున ఓబులవారిపల్లి మండలం గాదెల గ్రామానికి చెందిన కొట్టం శివ ద్విచక్ర వాహనంలో రాజంపేట వైపు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొందని తెలిపారు. ఈ ప్రమాదంలో బాధితుడి కాలు రెండు భాగాలుగా విడిపోయిందని అన్నారు. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో క్షతగాత్రుడిని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు స్థానిక ఎస్ఐ రఘురాం తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆస్తిలో వాటా ఇవ్వలేదని విభిన్నప్రతిభావంతుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

అన్నదమ్ములు ఆస్తిలో వాటా ఇవ్వలేదని ఓ విభిన్న ప్రతిభావంతుడు ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనకు సంబంధించి రామసముద్రం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయతీ, దిగువనల్లప్పగారిపల్లెకు చెందిన ఆర్.నారాయణస్వామి (56)కు తన అన్నలు రవణప్ప, రాజన్నలు ఉమ్మడిగా ఉన్న ఏడు ఎకరాల భూమిలో వాటా పంచలేదని అన్నారు. వారితో విసిగిపోయిన నారాయణస్వామి, తన భార్య మంజులతోపాటు ఇద్దరి పిల్లలను తీసుకుని బి. కొత్తకోట లోని ఆలేటివారిపల్లెల్లోని అత్తగారి ఇంటికి వెళ్లిపోయాడని తెలిపారు. రెండేళ్ల తర్వాత తిరిగి రామసముద్రం మండలంలోని దిగువ నల్లప్పగారిపల్లెకు వచ్చి తన సోదరులు రాజన్న, రవణప్పలను భూమి విషయమై నిలదీశాడని చెప్పారు. ఆస్తిలో వాటాలు ఇవ్వడానికి కుదరదని అన్నదమ్ములు తెగేసి చెప్పడంతో మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. స్థానికులు బాధితున్ని మదనపల్లెకు తరలించగా డాక్టర్లు మెరుగైన వైద్యం అందించినప్పటికి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని అన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.